నెల్లికుదురు: ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

పదిలో ఉత్తమ ఫలితాలను సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి

నెల్లికుదురు/కురవి, మార్చి 7 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కురవి మండలం రాజోలు ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రీ ఫైనల్ పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులో మాట్లాడి ఉత్తమ ఫలితాల సాధన కోసం సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షల్లో బుక్‌లెట్ విధానం అమలు చేస్తున్నట్లు విద్యార్థులకు గుర్తు చేశారు. నెల్లికుదురులో మండల విద్యాశాఖ అధికారి రాందాస్, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ పూర్ణచందర్, కురవిలో జిల్లా సైన్స్ అధికారి బీ అప్పారావు, కురవి ఎంఈవో బాలాజీ, హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోద హాస్పిటల్‌కు మెమో జారీ

నోద ఆసుపత్రిలో తనిఖీలు చేపడుతున్న డీఎంహెచ్‌వో

తొర్రూరు: తొర్రూరులోని నోద హాస్పిటల్‌లో జిల్లా వైద్యాధికారి మురళీధర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దవాఖానలో రోగులకు సంబంధించి ఆరోగ్య చార్ట్ లేదని, అలాగే హాస్పిటల్ అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు గుర్తించామని, సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. అలాగే, యాజమాన్యంపై చర్యలు తీసుకోవడానికి మెమో జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదే సందర్భంలో హరిపిరాల గ్రామానికి చెందిన ఓ మహిళకు దవాఖానలో అనవసరమైన శస్త్ర చికిత్స చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి స్పష్టం చేశారు. రోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని దవాఖానల్లో నిబంధనల ఉల్లంఘనల ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు.

పుస్తక రచయితకు సన్మానం

కురవి, మార్చి 7 : 'వీరభద్రస్వామి మహిమలు' అనే కవితా శతకాన్ని రచించిన మండలంలోని మొగిలిచర్ల గ్రామానికి చెందిన బాణాల వీరయ్యాచారిని కురవి మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం ఎదుట విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రాచారి మాట్లాడుతూ.. కురవిలో విద్యాభ్యాసం చేసిన వీరయ్యాచారి కురవి వీరభద్రస్వామి మహిమలు అనే పుస్తకాన్ని లిఖించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూదికట్ల శ్రీనివాసాచారి–పద్మ దంపతులు, మాజీ ఉప సర్పంచ్ సంగెం భరత్, మాజీ వార్డు సభ్యుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

నాడు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెద్దముప్పారంలో పచ్చదనంతో కళకళలాడుతన్న పల్లె ప్రకృతి వనం

నేడు

పెద్దముప్పారం గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు

ఎండిన 'వనం'

- అధ్వానంగా పల్లె ప్రకృతి వనాలు, నిర్వహణ మరిచిన అధికారులు
- ఎండిన మొక్కలతో ఎడారిని తలపిస్తున్న వైనం

దంతాలపల్లి, మార్చి 7 : పల్లెలకు శోభనిచ్చేలా గత ప్రభుత్వం ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేస్తే.., ప్రస్తుత ప్రభుత్వం వాటి నిర్వహణను గాలికొదిలేసింది. తీరొక్క మొక్కలతో ఊరూరా ఎకరం నుంచి అర ఎకరం భూమిలో ఏర్పాటు చేసిన వనాలు నేడు కళావిహీనంగా మారాయి. మొక్కలు, చెట్ల సంరక్షణను పట్టించుకునే వారు లేక ఎండిపోతున్నాయి. దంతాలపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో మూడేళ్ల క్రితం ఉపాధి పథకం కింద 20 గుంటల నుంచి ఎకరం ప్రభుత్వ భూమిలో గత సర్కారు ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. లక్షల రూపాయలు ఖర్చు చేసి జామ, సీతాఫలం, దానిమ్మ తదితర పండ్లు, పూల మొక్కలతోపాటు నీడనిచ్చే మొక్కలను నాటి, సంరక్షించింది. కానీ, నేడు పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వానంగా మారింది. పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణంలో కళకళలాడిన వనాలు నేడు ఎండిన చెట్లు, మొక్కలతో ఎడారిని తలపిస్తున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాల నిర్వహణకు పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. కొద్దిరోజుల్లో పండ్లు చేతికి వచ్చే దశలో ఉన్న చెట్లు మోడుబారుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నిమ్మకాయలతో ఆగంతకుడి హల్‌చల్

ఇనుగుర్తి, మార్చి 7 : మండలంలోని చిన్ననాగారం గ్రామంలో నెల రోజులుగా నిమ్మకాయలతో ఆగంతకుడు హల్‌చల్ చేస్తున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. చిన్ననాగారంలోని ముత్యాలమ్మ వీధిలో నెల రోజులుగా గుర్తుతెలియని వ్యక్తి నిమ్మకాయలపై కనుబొమ్మ గీసి, పసుపు, కుంకుమ అంటించి కాలనీలోని ఇండ్ల ముందు వేస్తున్నాడు. దీంతో రాత్రి అయితే కాలనీ వాసులు భయంతో బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. ఇంతటితో ఆగకుండా కాలనీకి చెందిన కొంతమంది వ్యక్తుల పేర్లతో అసభ్యకరమైన పదజాలంతో లెటర్స్ రాసి వీధిలో పడేస్తున్నారని కాలనీవాసులు తెలిపారు. దీంతో కాలనీవాసులు నెల్లికుదురు ఎస్సై రమేశ్‌బాబుకు ఫిర్యాదు చేశారు.

పెద్దగుట్టపై కార్చిచ్చు కట్టడి

'నమస్తే తెలంగాణ' కథనంతో అటవీశాఖ చర్యలు

బయ్యారం, మార్చి 7: బయ్యారం పెద్దగుట్టపై చెలరేగిన కార్చిచ్చును శుక్రవారం అటవీ శాఖ కట్టడి చేసే చర్యలను చేపట్టింది. పెద్దగుట్టపై మంటలు అనే శీర్షికతో శుక్రవారం నమస్తేతెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అటవీశాఖ వెంటనే చర్యలను ప్రారంభించింది. నాలుగు బృందాలుగా ఏర్పడి అటవీ ప్రాంతంలోని నలు మూలల నుంచి బోయర్ల ద్వారా మంటలను కట్టడి చేశారు. అయితే రెండు రోజులుగా వీస్తున్న ఈదురు గాలుల కారణంగా మంటలార్పడం అటవీ శాఖకు కష్టతరంగా మారింది. ఇప్పటికే ఫైర్‌లైన్ ఏర్పాటు చేశామని, మంటలు చెలరేగకుండా పటిష్ట చర్యలు తీసుకొని కార్చిచ్చును కట్టడి చేసి అడవులను రక్షిస్తున్నామని ఎఫ్ఆర్‌వో సువర్ణలారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వోలు సాంబశివ, రమేశ్, రవికుమార్, ఉమారాణి పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలని వినతి

దంతాలపల్లి : రాష్ట్ర ప్రభుత్వం జీపీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతినెలా గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు చెల్లించి, ఎస్‌టీవోలో నిలిచిపోయిన బకాయిలను విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వివేక్‌రామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కందగట్ల యాకయ్య, ఉపాధ్యక్షుడు సోమలింగం, ప్రధాన కార్యదర్శి సురేశ్, యాకనాథం, కంట్లమయ్య, రామయ్య పాల్గొన్నారు.

జీపీ కార్మికుల ధర్నా

కురవి, మార్చి 7 : కురవి, సీరోలు మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల ఉపాధ్యక్షుడు ఉపేంద్రాచారి మాట్లాడుతూ.. కార్మికుల వేతనాల కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని, రెండో పీఆర్సీ పరిధిలోకి పంచాయతీ సిబ్బందిని తీసుకోవాలన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలను కేటగిరీల వారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో వీరబాబుకు వినతిపత్రం అందజేశారు.

హామీలను నిలబెట్టుకోవాలి

చిన్నగూడూరు మార్చి 7 : తెలంగాణ ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జీపీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆదిబాబు, వెంకన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు గణేశ్, ఉపేంద్రాచారి, పద్మ, మంగమ్మ, కిరణ్, చంద్రమ్మ ,లక్ష్మి, నాగమ్మ, సీతారాములు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

గూడూరు, మార్చి7 : జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మట్టెవాడ గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్సై గిరధర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూనెం వీరస్వామి(45) తాగుడుకు బానిసవ్వడంతో అతడి ఆరోగ్యం దెబ్బతిన్నది. దీంతో జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏరియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి భార్య సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరిపెడలో మరొకరు..

మరిపెడ : చిక్సిత పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్లంపేట లక్ష్మ తండాలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బానోతు నరేశ్ (24)కు సంవత్సరం క్రితం ప్రమాదం జరగడంతో వెన్నుపూసకు దెబ్బతగిలి లేవలేని స్థితిలో ఉన్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. కటుంబ సభ్యులు చిక్సిత నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించగా, చిక్సిత పొందుతూ మృతి చెందాడు.

గుంతలు పూడ్చిన ఆటో యూనియన్ సభ్యులు

నర్సింహులపేట, మార్చి 7: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే స్టేజీ రహదారిపై గుంతలుపడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఆటో యూనియన్ సభ్యులు రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో సిమెంట్, కంకర వేసి పూడ్చివేశారు. ఆటోయూనియన్ సభ్యులు చేసిన మంచి పనిని వాహనదారులు, గ్రామ ప్రజలు మెచ్చుకున్నారు. అభినందించారు. గుంతలు పూడ్చిన వారిలో ఆటో యూనియన్ సభ్యులు బొమ్మగాని సురేశ్, బత్తుల రమేశ్, యాకయ్య దిలీప్, రవి ఉన్నారు.

ఇంటర్ ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతం

మహబూబాబాద్ రూరల్, మార్చి 7 : జిల్లాలో శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సర ఇంగ్లిష్ పరీక్ష అన్ని సెంటర్లలో ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా అధికారి మదార్‌గౌడ్ తెలిపారు. 4,525 మంది విద్యార్థుల్లో జనరల్ విభాగంలో 3,186, ఒకేషనల్ విభాగంలో 1,093 మంది, విద్యార్థులు హాజరు కాగా, 246 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

డోర్నకల్‌లో సామాజిక తనిఖీ

డోర్నకల్ : ఉపాధి హామీ 15వ విడుత సామాజిక తనిఖీ కార్యక్రమం శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు జరిగి ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. కాగా, పనుల్లో అవినీతి జరిగినట్లు గుర్తించిన అధికారులు 30 గ్రామాల కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లుకు రూ.1.73లక్షల జరిమానా విధించారు. డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్ రాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మీర్జా మున్వర్ భేగ్, ఏపీవో పార్థసారథి పాల్గొన్నారు.

ప్రతిజ్ఞా దివస్‌ను విజయవంతం చేయాలి

గార్ల, మార్చి 7: హైదరాబాద్‌లోని ట్యాంకుబండ్‌పై ఈనెల 9న నిర్వహించనున్న ప్రతిజ్ఞా దివస్‌ను విజయవంతం చేయాలని శుక్రవారం తెలంగాణ ఉద్యమకారులు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు జగదీశ్, జానీ, నాగచారి, మల్లిబాబు, వీరస్వామి, కాంతారావు, శ్రీను పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

గూడూరు :అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్మికులు ఎంపీడీవో వీరస్వామికి వినతి పత్రం అందజేశారు. పంచాయతీ కార్మిక సంఘం జిల్లా బాధ్యుడు మోయిన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించినట్లుగా జీపీ సిబ్బందికి గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు అందించాలన్నారు. ఎస్‌టీవోలో ఉన్న జీపీ నిధులను విడుదల చేసేందుకు ఆటకంగా ఉన్న ఫ్రీజింగ్‌ను వెంటనే తొలగించాలన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున కార్మికులు ఒక్కపూట మాత్రమే పని కల్పించాలని కోరారు.

క్షయ వ్యాధి కట్టడికి చర్యలు..

బయ్యారం : క్షయవ్యాధి కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని మెటర్నల్ చైల్డ్‌హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం అన్నారు. టీబీ ముక్త్ భారత్ ప్రోగ్రాంలో భాగంగా బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. మండల పరిధిలోని చర్లపల్లిలో గతేడాది నమోదైన కేసుల వివరాలను పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంతో జీపీని టీబీ రహిత గ్రామంగా గుర్తింపు కోసం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు, కో ఆర్డినేటర్ అశోక్, సూపర్‌వైజర్ జయరామ్, నోడల్ పర్సన్ రామారావు పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణ కోసం శాంపిల్స్ సేకరణ

మరిపెడ : టీబీ వ్యాధి నిర్ధారణ కోసం రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం ఉన్న వారి నుంచి 54 శాంపిల్స్‌ను సేకరించినట్లు డాక్టర్ రవి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. శాంపిల్స్‌ను జిల్లా కేంద్రానికి పంపి టీబీ నిర్ధారణ అయితే 6 నెలలపాటు ఉచిత చికిత్స, రూ.500 పారితోషకం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, అనిత, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీటీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

మరిపెడ : బీటీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మరిపెడ అగ్రికల్చర్ సహాయ వ్యవసాయ సంచాలకుడు విజయ్ చంద్ర హెచ్చరించారు. శుక్రవారం ఆయన గుండెపుడి గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీటి –3 పత్తి విత్తనాల వల్ల క్యాన్సర్ లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎవరైనా విక్రయిస్తే ఆరేళ్లు జైలు శిక్ష విధిస్తారని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరాసింగ్, మరిపెడ ఎస్సై సతీశ్, ఏఈవో సైదమ్మ పాల్గొన్నారు.

తిర్మలాపురంలో రైతు క్షేత్ర పాఠశాల

కురవి, మార్చి 7 : కురవి మండలం తిర్మలాపురం గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా సమగ్ర సస్యరక్షణ కిట్లు (ఐపీఎం) అందజేశారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయశంకర్ పర్యవేక్షణలో ఆరు వారాల నుంచి క్షేత్రస్థాయిలో మిరప పంట వేసినప్పటి నుంచి చేతికొచ్చే వరకు పాటించాల్సిన అన్ని సస్యరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు ఐపీఎం కిట్‌లను అందజేశారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ శంకర్ రైతులకు పురుగు గుడ్లపై వేపనూనె పిచికారీ, రెక్కల పురుగుపై నిఘా పెట్టడానికి లింగాకర్షక బుట్టలు, ఐపీఎం కిట్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ సస్య రక్షణ అధికారి బసవన్నప్ప, సాంకేతిక వ్యవసాయ అధికారి రాజు, మండల వ్యవసాయ అధికారి నరసింహారావు, ఏఈవో రాజేశ్వరి పాల్గొన్నారు.

డ్రాయింగ్ కోర్సు పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

తొర్రూరు : సాంకేతిక విద్య సర్టిఫికెట్ (డ్రాయింగ్) కోర్సు పరీక్షల్లో స్థానిక మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. తెలంగాణ ఎడ్యుకేషన్ విభాగం జనవరిలో నిర్వహించిన పరీక్షలకు పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో నలుగురు ఫస్ట్ డివిజన్, మరో ఎనిమిది మంది సెకండ్ డివిజన్‌లో ఉత్తీర్ణులయ్యారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వనజ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులకు మార్గదర్శకంగా ఉన్న ఆర్ట్ టీచర్ మాలతిని ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

కఠినంగా శిక్షించాలి

ఇనుగుర్తి : జగిత్యాల జిల్లా లింగాపూర్‌కు చెందిన దళిత ఆశ వర్కర్‌పై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ మండల కార్యదర్శి జయరాజ్ రాస్తారోకో చేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఆశ వర్కర్‌పై దాడి చేసిన ఆగంతకుడిని గుర్తించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వరూప, సుజాత, లక్ష్మి, విజయ, లలిత, సునీత, అరుణ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడి కన్నుమూత

తొర్రూరు, మార్చి 7 : స్వాతంత్ర్య సమరయోధుడు దాసరి మల్లయ్య శుక్రవారం కన్నుమూశారు. ఆయన పార్థివదేహానికి బీఆర్ఎస్ నాయకులు పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోనుగంటి సోమేశ్వరరావు, తొర్రూరు మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళపెల్లి శ్రీనివాస్, తొర్రూరు పట్టణ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఉపేంద్ర, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

నీళ్ల కోసం రైతుల ఆరాటం

11 ఎల్ ఉప కాలవలో రాళ్లను తొలగిస్తున్న రైతులు

నర్సింహులపేట, మార్చి 7: ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. డీబీఎం ఉప కాల్వ ద్వారా వారానికి ఒకసారి నీళ్లు వస్తున్న నీళ్లను కాపాడుకోవడం కోసం పెద్దనాగారం, వస్రంతండా, గంగ్యాతండా, బుడ్డతండా, అజ్మీరాతండా, నర్సింహపురం బంజర, చిన్నగూడూరు మండలంలోని సోమ్లాతం డా, ఉగ్గంపల్లికి వెళ్లే 11ఎల్ ఉప కాల్వల్లో పేరుకుపోయిన మట్టి, రాళ్లను రైతులు తొలగించారు.

మద్దతు ధరల చట్టం చేయాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 7 : పార్లమెంట్‌లో కనీస మద్దతు ధరల చట్టం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఎస్ స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా మద్దతు ధర చట్టం వెంటనే తీసుకు రావాలన్నారు. భారత నూతన వ్యవసాయ మార్కెట్ సవరణ ముసాయిదా బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, పైండ్ల యాకయ్య, లింగన్న, వెంకటేశ్వర్లు, రామచంద్రు, రమేశ్ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మాదిగలకు చోటివ్వాలి

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ ప్రభుత్వం మంత్రివర్గంలో మాదిగలకు చోటు కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీరయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను ఏ, బీ, సీ గ్రూప్‌లుగా కాకుండా నాలుగు గ్రూప్‌లుగా చేస్తేనే 59 ఉప కులాలకు లాభం జరుగుతుందన్నారు. తెలంగా ప్రభుత్వం పునరాలోచన చేసి మాదిగవర్గాలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సోమయ్య, సాంబయ్య, ఎంఎస్పీ మహిళా జిల్లా అధ్యక్షురాలు రజియా, ఎండీ పాషా, రవి, సుమిత్ర, మణెమ్మ, సతీశ్ పాల్గొన్నారు.

సైనిక్ పాఠశాల తరహాలో పోలీస్ స్కూల్

మహబూబాబాద్ రూరల్, మార్చి7 : సైనిక్ స్కూల్ తరహాలో పోలీస్ స్కూల్ కూడా దేశానికి ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో పోలీస్ స్కూల్ వెబ్ సైట్ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి పోలీస్ స్కూల్‌లో అడ్మిషన్లు ఉంటాయని, ఇందులో పోలీస్ అమరుల కుటుంబాల పిల్లలకు మొదటి ప్రాధాన్యత, పోలీస్ కుటుంబాలకు, సాధారణ పిల్లలకు ప్రవేశాలు ఉంటాయన్నారు. క్రీడలపై ప్రత్యేక ఒరవడిని సృష్టించడం ఈ పాఠశాలల ప్రత్యేకత అన్నా రు. ఈ కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుల్స్‌ను పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మహబూబాబాద్ రూరల్ : ప్రస్తుత వరిలో సుడి దోమ నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని జంగిలి కొండ, వీఎస్ లక్ష్మీపురంలో వరిపంటలను సందర్శించి మాట్లాడారు. వరి దుబ్బు చేసే దశ నుంచి ఈనే దశలోకి వచ్చిందని, ప్రధానంగా సుడి దోమ ఆశిస్తున్నదని, రైతులు ఈ దోమను ప్రాథమిక దశలోనే నివారించాలన్నారు. సుడి దోమ పూర్తిగా రసం పీల్చడం వల్ల పంట పసుపు వర్ణంలోకి మారి రైతుకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. రైతులు పాయలు తీసి పంట మొదళ్లలో పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో తిరుపతిరెడ్డి, ఏఈవో షహనా బేగం, రైతులు నలమాల సుధాకర్, రవి, కిషన్ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 7 : బ్యాంకర్లు తమ ఖాతాదారులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలని డీఎస్పీ తిరుపతిరావు సూచించారు. శుక్రవారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో బ్యాంకర్లతో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్, ఓటీపీలను ఎవరికి పడితే వారికి ఇవ్వకుండా జాగ్రత్తపడేలా ఖాతాదారుల్లో అవగాహన కల్పించే బాధ్యత బ్యాంకర్లదేనన్నారు. ఎక్కువగా ప్రముఖ లోన్ సంస్థల నుంచి, ప్రభు త్వ పథకాల పేరుతో నిత్యం అనేక కాల్స్ వస్తున్నాయని, వీటిపై ఖాతాదారులను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు దేవేందర్, సరవయ్య, రాజేశ్, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజీ కేసులను పరిష్కరించుకోండి..

మహబూబాబాద్ రూరల్: రాజీపడగలిగే సివిల్, క్రిమినల్, మోటర్ వాహనాలు, వివాహ తగాదాల వంటి కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా వెంటనే పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోర్టులో వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సాధారణ పద్ధతిలో పరిష్కరించడం సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేశ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గార్ల, మార్చి 7: పెద్ద కిష్టాపురం జడ్పీ